సూర్యోదయం

మన్నెం శారద

హాల్లో ఈజీఛైర్లో కూర్చున్న రాఘవరావు చుట్టకొనను కసుక్కున కొరికి అన్నపూర్ణ వైపు చూసేడు.

గుమ్మానికి చేరబడి నిల్చున్న అన్నపూర్ణ తలదించుకుని వుంది. అంచేత అతని చూపుల్లోని తీక్షణతని ఆమె గమనించలేదు. కానీ.... అతడెంతగా వుడికిపోతున్నాడో మాత్రం ఆమెకి బాగా తెలుసు.

హాల్లో కిటికీకి పక్కన వేసివున్న బెంచీమీద కొందరు ఊరుపెద్దలు; దగ్గర బంధువులయిన హనుమాన్లు, పార్థసారధి కూర్చుని వున్నారు.

వీధి గుమ్మానికి పక్కగా రాఘవరావు భార్య కనకమ్మ, కూతురు జానకి కూడా నిలబడి వున్నారు

"చూస్తున్నావుగా. నీ కూతురు చేసిన నిర్వాకం!" అన్నాడు రాఘవరావు తీవ్రమయిన కంఠంతో.

అన్నపూర్ణ తలెత్తి అన్నగారివైపు చూసింది.

"ఇలాంటివి మన యింటావంటా వున్నాయా? పెళ్ళయిన మూడు నెలల్లోనే మొగుడుపోతే నువ్వెంత నీతిగా బ్రతికేవు! పరాయి మొగవాణ్ణి ఎన్నడైనా కన్నెత్తి చూసేవా? తొమ్మిది నెలలకి పుట్టిన బిడ్డని పెంచుతూ ఈ యింట ఎలా కాలం గడిపేవు! కానీ.... ఈ రోజు అది.... నా కొడుకు పోయేడో లేడో అప్పుడే మారు మనువుకి సిద్ధమయిందంటే.... దానికి ఎంత కొవరమెక్కి వుందో ఆలోచించు!" అన్నాడు. ఆ మాటలు చాలా కఠినంగా బాణాల్లా దూసుకొచ్చేయి రాఘవరావు నోటినుండి.

అన్నపూర్ణ మాట్లాడలేదు.

"నిన్నయినా చూసి బుద్ధితెచ్చుకోమని

చెప్పమ్మా అన్నపూర్ణా! అసలే ఆయన చెట్టంత కొడుకుపోయి దుఃఖంలో మునిగి వున్నాడు. దెబ్బమీద దెబ్బగా ఈ పిల్ల వెంటనే పెళ్ళి చేసుకుంటే ఊరు 'ఛీ' కొట్టదూ! నీ తోబుట్టువు పరువు సంగతి ఆలోచించు!" అన్నాడు హనుమాన్లు శోక్యం చేసుకుంటూ.

"ఎందుకు చెబుతుంది! నాకు చెప్పే ఆవిడకి మహా యిది!" అంది కనకమ్మ చేతులు తిప్పుతూ!

అన్నపూర్ణమ్మ కనకమ్మవైపు అదోలా చూసింది.

పండక్కి పట్టుచీర కొనిపెట్టలేదని మొగుడిమీద అలిగొచ్చి— ఆర్నెల్లగా పుట్టింట్లో తిష్టవేసిన జానకిలాంటిదే తన 'శైలా' అని ఆమె ఛస్తే ఆలోచించదని అన్నపూర్ణకు తెలుసు!

"వాళ్ళకి నేనెంత చేసేనయ్యా! తల చెడి ఇది నా పంచచేరితే ఆ రోజు నుండి దీన్ని — దీని కూతుర్ని కడుపులో పెట్టుకొని కాచలేదూ! దాన్ని ఏ కొరగాని వాడికో యిచ్చి కట్టబెట్టకుండా నా స్వంత కొడుకుకే చేసుకోలేదూ! మూడేళ్ళ కాపురం చేసిన దానికంత మరపొచ్చే సేదా మొగుడు! ఇదిగో, మంచిగా చెబుతున్నాను. నా మాట వినకపోతే భూమ్మీద మూకలు లేకుండా చేస్తాను దానికి! వెంటనే ఈ కాగితాలమీద సంతకాలు పెట్టి మర్యాదాగా ఇవ్వమను!" అంటూ రాఘవరావు అన్నపూర్ణకి కొన్ని కాగితాలు అందించేడు.

అన్నపూర్ణమ్మ వాటిని అందుకొని లోనికెళ్ళిపోయింది.

అన్నపూర్ణ వెళ్ళగానే హనుమాన్లూ, పార్థసారథి, వాళ్ళతోపాటు ఊరిపెద్దలు కూడ పైకిలేచేరు వెళ్ళడానికి.

"ఒప్పుకుంటుందిలే రాఘవా! చెట్టంత అన్నగార్ని వదులుకొంటుందా అన్నపూర్ణ! ఇదిగో ఆ డబ్బొచ్చేక నా సంగతి మరచిపోవుగా! నీ మీద భరోసా పెట్టుకొనే ఉలవపాడు సంబంధం ఖాయం చేస్తున్నాను సావిత్రికి!" అన్నాడు పార్థసారథి.

"సరిసర్లే! ముందు దాన్ని సంతకాలు పెట్టి ఏడ్వనీ!" అన్నాడు విసుగ్గా రాఘవరావు ఆరిపోయిన చుట్టను మళ్ళీ వెలిగించుకుంటూ.

వాళ్ళిద్దరూ వెళ్ళిపోగానే జానకి తండ్రి దగ్గరగావచ్చి "ఎంతొస్తుందేంటి నాన్నా!" అంది గారంగా.

రాఘవరావు కూతురివైపు ముద్దుగా చూసి "చాలానే వస్తుంది! ఒక లక్ష కేష్, ఉండడానికో యిల్లు, చేసి వెలగబెడితే మీ వదినకు ఉద్యోగం" అన్నాడు.

"నన్ను కూడా అలా విమానాలు నడిపే వాడికిచ్చి చెయ్యాక అనవసరంగా పొలం

దున్నుకునేవాడికిచ్చి కట్టేరు. రేపేమన్నా అయితే నాకేం వస్తుంది పిండాకూడు." అంటూ వాపోయింది జానకి.

* * *

అన్నపూర్ణ చెరువుగట్టున మూర్చుని ఏిందె తోముతున్నది.

ఎవరో కొంటెపిల్లవాడు విసిరిన రాయికి చెరువంతా అలలు చెలరేగేయి.

సరిగ్గా అన్నపూర్ణ అంతరంగమూ అలానే వుంది.

ప్రొద్దుటే అన్న వేసిన రాయికి ఆమె మనసంతా అల్లకల్లోలమయిపోయింది.

ఈ చిక్కు సమస్యని ఎలా విడదీసుకోవాలి?

ఒకపక్క కన్నకూతురూ. మరో పక్క అన్నగారు.

అన్నపూర్ణకి ఎటూ తోచడంలేదు.

గతమంతా ఆమె కళ్ళముందు గిర్రున తిరిగింది.

తనకి పదహారో సంవత్సరంలో కాబోలు శేషగిరితో పెళ్ళయింది.

శేషగిరి పెద్ద అందగాడు కాకపోయినా చాలా మంచివాడు. అతని సాహచర్యంలో తనకి సుఖపడటం ఎలాంటిదో తెలిసింది.

సరిగ్గా అప్పుడే దేవుడు చూడలేకపోయేడు. పొలం నుండి తిరిగొస్తున్న అతను పాము కాటుకి గురయి మరణించేడు.

అంతటితో అప్పుడే వెలుగుని చూడ్డానికి అలవాటుపడ్డ తన జీవితంపై శాశ్వతంగా చీకటితెర పడింది.

అప్పటికే నెంతప్పిన తను అన్న పంచ చేరక తప్పలేదు.

తన పొలం — తన భర్త పొలం తిరిగి అన్నచేతికే చిక్కాయి.

వదినగారి దెప్పిపొడుపులతో — అన్నగారి ఈసడింపులతో తన హృదయం ఏనాడో మొద్దుబారిపోయింది.

మరో ఆరునెలలకి శైలజ పుట్టింది

శైలజకి పదో నెలలో ఫిట్సు వచ్చే సరికి బతకదనుకొన్నాను.

కన్నతల్లిని ఎరుగదు తను. తండ్రి ఊహ తెలిసేనాటికే పోయేడు.

కట్టుకున్న భర్త మూడునెలలు మురిపించి కన్నుమూసేడు.

ఇప్పుడు ఈ చివ్వారి వెలుగులు కూడ తీసేసుకుంటాడా ఆ భగవంతుడు?

తను సహించలేక పట్నంనుం చొచ్చిన ఇంగ్లీషు డాక్టరుకి చూపించమని అన్నగార్ని ప్రాధేయపడింది.

పట్టించుకోలేదతను.

"ఆ ముదనష్టపుది తండ్రి ఆయువు పోసుకుని మరీ పుట్టింది. దానికేంకాదులే" అని ఈసడించి కండువా దూడించుకొంటూ మరీ వెళ్ళిపోయేడతను.

తను మరి భరించలేకపోయింది.

కనకమ్మ కాళ్ళా వ్రేళ్ళాపడి పది రూపాయిలు తీసుకుని బిడ్డను భుజాన వేసుకొని, జానకిని తోడు తీసుకుని అస్పత్రికి పరిగెత్తింది.

అప్పుడే తనకి డాక్టరు రాజా పరిచయ మయ్యేడు.

రాజా బిడ్డని పరీక్షచేసేడు.

వెంటనే హాస్పటల్లో ఎడ్మిట్ చెయ్యమని- పరిస్థితి ప్రమాదకరంగా వుందని చెప్పేడాయన.

జానకిని యింటికి పంపించేసి బిడ్డతో పాటు హాస్పటల్లో వుండిపోయింది మూడురోజులు।

ఆ మూడురోజుల్లో డాక్టరు మంచితనాన్ని గ్రహించగల్గింది తను।

అతను తనదగ్గర నయాపైసా తీసుకోకపోగా తన బిడ్డని ఎంతో జాగ్రత్తగా కనిపెట్టి ఖరీదైన మందులు వాడేడు।

చచ్చిపోతుందనుకొన్న తన శైలజ అతని వైద్యంలో తిప్పుకొంది।

అతనికి చేతులు జోడించి బిడ్డని తీసుకొని యింటికొచ్చింది।

పదిరోజుల తర్వాత చెరుపు గట్టు మీద నిలబడి తనవైపే చూస్తున్న అతన్ని చూసి ఆదోలా అయ్యింది తనకి।

అడుగులు తడబడ్డాయి।

"మీరా!" అంది తను

"మీకోసమే అన్నాడతను" నవ్వుతూ.

ఆ కళ్ళు చిలిపిగా నవ్వినట్లనిపించింది తనకి.

తన గుండె దడదడ లాడింది. చేతిలోని నిండు నీళ్ళబిందె జారిపోబోయింది.

గబుక్కున పట్టుకున్నాడతను.

"అదేంటలా అయిపోతున్నారు! పాప గురించి అడగాలని వచ్చేన్నేను। మీరు కనీసం ఒకసారన్నా వచ్చి చెప్పలేదుగా" అన్నాడతను బిందెని తన నడుంమీద సరిగ్గా వుంచుతూ

సరిగ్గా ఆ దృశ్యం చెరువుగట్టున నీళ్ళకొచ్చిన కొందరు ఆడవాళ్ళ దృష్టిని దాటిపోలేదని తనకు తెలియదు;

వాళ్ళ కనుబొమ్మలు చూడరానిది చూసినట్లు పైకి లేచేయన్న విషయం తను గమనించలేదు।

తను తడబడుతూ ఇంటివైపు అడుగు లేసింది।

కాని ఆ రాత్రి నిద్రపట్టక దొర్లుతున్న తన ఆలోచనల నిండా అతను జొరబడటానికి ప్రయత్నించేడు।

అతని గురించి ఆలోచించటం కూడ మహా పాపమని తల విదిలించుకొని కళ్ళు మూసుకుంది తను।

మర్నాటి నుండి తన ప్రమేయం లేకుండానే అతనెక్కడయినా కన్పిస్తే బాంగుండునని తన కళ్ళు అతనికోసం వెదుకులాట ప్రారంభించేయి.

అతన్ని చూడ్డానికి ఒకసారి హాస్పిటల్‌కి వెళ్ళాలనిపించేది.

అంతలోనే ఏదో భయం ఆవరించి ఆ ఆలోచనని అదిమిపెట్టేది తన హృదయం.

వారం రోజుల తర్వాత మళ్ళీ చెరువు గట్టు దగ్గరే కనిపించేడు తనకి.

దూరంగా వున్న పొగడచెట్టు క్రింద అతన్ని చూడగానే తన హృదయం గోదావరిలా ఉప్పొంగిపోయింది.

"బాగున్నారా?" అంటూ పలకరించేసింది తను.

అతను నవ్వి "నువ్వా?" అన్నాడు ఆత్మీయంగా.

నవ్వింది తను చాల రోజులకి తియ్యగా.

భర్త పోయేక తను అలా మనస్ఫూర్తిగా నవ్వడం అదే మొదటిసారి.

ఇద్దరూ అలా అకారణంగా నవ్వుకోవడం ఆ గట్టునవున్నవాళ్ళ హృదయాన్ని మండించేస్తున్నాయనే సంగతి తనకిగాని అతనికిగాని తెలియదు.

మరో పదిరోజుల తర్వాత శైలుని డాక్టరుకి చూపించడానికి హాస్పిటల్‌కి వెళ్ళింది తను.

శైలుని పరీక్షచేస్తూనే మెల్లగా అడిగేడతను "ఎన్నాళ్ళీ ఒంటరిజీవితం గడుపుతారు?" అని.

తను తల దించుకొంది.

అతడు శైలుని తనకి అందిస్తూ అన్నాడు.

"మిమ్మల్ని కించపరచాలని అడగటం లేదు. మూడునెలల కాపురం కోసం– మీ జీవితమంతా ఇలా ఒంటరితనంతో బతకడంకన్నా వేరే నరకం మరొకటి వుండదు. మీరు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను."

తనకి వళ్ళంతా చెమటలుపోసేయి.

ఏ సంగతీ చెప్పకుండానే కంగారుగా శైలునెత్తుకుని ఇంటికి వచ్చేసింది.

ఇంటికొచ్చినా గుండెదడ తగ్గలేదు తనకి.

తను వచ్చేసరికి హాల్లో వదినగారితో పాటు హనుమాన్లు పెళ్ళాం ఆదిలక్ష్మి, పార్థసారథి పెళ్ళాం పర్వతవర్ధని చెవులు కొరుకుతున్నారు.

వాళ్ళ ముగ్గురు తనని అదోలా చూసేసరికి భయంవేసింది తనకి.

"ఎక్కణ్ణుంచి?" అంది వదిన అరాగా.

"పాపని అసుపత్రిలో.... చూపించి వస్తున్నాను!" అంది తను.

"దానికేం మాయరోగమొచ్చిందని? ఆ వంకతో ఆ కుర్రడాక్టర్‌గాడితో సరసాలాడ్డానికా?"

వదినగారి హుంకరింపుకి తన గుండె జారి క్రిందపడినట్లయింది.

ఆమెవేపు నిస్సహాయంగా చూసింది.

"అదే మంచిపని వదినా! ఆ చెరువు గట్టుమీద సరసాలు అందరూ చూసి నవ్విపోకుండా!" అంది రాగంతీస్తూ ఆదిలక్ష్మి.

"నేను.... నేను ..ఏ పాపం ఎరుగను వదినా!" అంది తను కన్నీళ్ళతో.

"ఆ సంగతి నిప్పుమీద ఉప్పులా ఎగిరిపడ్తోన్న మీ అన్నగారికి చెప్పమ్మా! బయటకెళ్తే నల్గురూ అనేమాటలు వినలేక అవమానంతో బోనులో పులిలా గదిలో పచార్లుచేస్తున్నారు!" అంది వదినగారు నిష్ఠూరంగా.

"చెప్పు! ఈరోజు మీ యిద్దరి ప్రాణాలు తీసి నేను ఛస్తాను! వాడికీ.... నీకు.... ఎన్నాళ్ళనుండి సాగుతున్నాందీ రంకు!" అంటూ అన్నగారు బయటకు వచ్చేసరికి నిలువెల్లా వణికిపోయింది తను.

"అన్నయ్యా!" అంటూ బావురుమంది తను.

"ఈ నంగనాచి ఏడుపుకేంలే! నా పరువు గంగలో కలిపేవు! బయట నన్ను తలెత్తుకోకుండా చేసేవు!" అంటూ ఇంతెత్తు లేచేడు అన్నగారు.

"నేను.... నేను.... ఏ తప్పు చెయ్యలేదు! అతను.... అతను.... నా కిష్టమైతే నన్ను.... పెళ్ళి....చేసుకుంటానన్నాడు.

అంతే!" అంది తను దుఃఖాన్ని అణిమి పెడుతూ.

"హవ్వ!" అంటూ నోరు నొక్కుకుంది వదినగారు.

"వెధవముండకి పెళ్ళి!" అంటూ దీర్ఘం తీసింది ఆదిలక్ష్మి.

"మా అమ్మ మొగుడుపోతే వీధి ముఖం చూసి ఎరుగదు! అంతా పిదప కాలం!" అంటూ అరవయ్యేళ్ళకి ముండ మోసిన తల్లిని తలచుకొంటూ గర్వంగా చెప్పింది పర్వతవర్ధని.

వాళ్ళ మాటలకి రెచ్చిపోయిన అన్నగారు తనమీద చెయ్యి చేసుకోబోయేడు.

వదినగారు లేచి అడ్డుపడింది.

"చాల్లెండి. ఇప్పటికే నలుగురికి చులకనయిపోయేం. ఆ వెధవను పిలిపించి మళ్ళీ దీని జోలికి రావొద్దని గద్దిపెట్టండి" అంటూ సలహా యిచ్చిందావిడ.

ఆ మర్నాడు తన అన్నగారి కబురందుకొని అతను యింటికొచ్చేడు.

బయట హాల్లో పంచాయితీకి అంతా సిద్ధపడ్డారు.

"నా చెల్లెలికీ నీకూ ఏంట్రా సంబంధం?" తన అన్న మోటుగా అడగటం తనకి విన్పిస్తూనే వున్నది.

అతడా ప్రశ్నకు తెల్లబోయేడేమో! అయిదు నిముషాల తర్వాత జవాబు చెప్పేడు "మానవతావాదం!" అని.

"కథల్లా కబుర్లు చెప్పకు. దాన్ని నువ్వు పెళ్ళి చేసుకుంటాననటం అబద్ధమా!"

"నిజమే! ఇప్పుడు మీ ముందుకూడ అదేమాట చెబుతున్నాను. మీ రంగీకరిస్తే నేను ఆమెని పెళ్ళిచేసుకోడానికి సిద్ధమే!" అన్నాడతను స్థిరంగా.

అతని జవాబుకి తన గుండె కరిగి కన్నీళ్ళయి ప్రవహించింది.

నీరసంగా లేచి కిటికీలోంచి చూసింది అతనివైపు.

"ఏంట్రా చూస్తున్నావు? దాన్ని లేవదీసుకుపోయి సరదా తీరేక వదిలేద్దామనా?" అంటూ కొట్టడానికి లేచిన అన్నగార్ని గబుక్కున పట్టుకున్నాడు హనుమాన్లు.

"నీకీవూరు కొత్తనుకుంటానబ్బాయి! వాళ్ళకుటుంబం సంగతి తెలియక తొందర పడుతున్నావు! మారు మనువంటే మారణ హోమమే వాళ్ళ యిళ్ళల్లో!" అన్నాడు హనుమాన్లు.

అతని ముఖం అవమానంతో ఎర్రబడటం తను చూడగల్గింది.

"మీ రెందుకింతగా బాధ పడిపోతున్నారో నాకు అర్థంకావడం లేదు. నిజంగా ఆలోచిస్తే మీ కందరికీ హృదయాలు లేవు! ఉంటే మూడునెలల కాపురానికే నూరేళ్ళు ఆమెని మోడులా బ్రతకమని శాపించేవారు కాదు! సహృద

యంతో ఆమె మెడలో తాళి కట్టాలను కున్న నన్ను ఇలా అవమానించేవారు కాదు!" అన్నాడు రోషంగా.

"ఏంట్రా మాకు హృదయాల్లేవని లెక్కేస్తున్నావు! నా చెల్లెలితో పెళ్ళికాదు కాదా-దాన్ని చూద్దానిక్కూడ వీల్లేదు! అలా చేస్తే.... నీకు భూమ్మీద నూకలు చెల్లి పోయినట్లే! మర్యాదగా పో!" అంటూ రంకెలేస్తున్న అన్నగార్ని చూసి అతను తొణకలేదు!

"ఆ మాట చెప్పడానికి మీ రెవరు? అన్నపూర్ణని చెప్పమనండి!" అన్నాడు ధీమాగా.

"నా చెల్లెలు చెప్పాలంట్రా! నీకు మాటలతో బుద్ధిరాదు!" అంటూ మళ్ళీ పైకిలేచేడు తన అన్నగారు.

మళ్ళీ పట్టుకున్నాడు హనుమాన్లు.

"పోనీ అమ్మాయితోనే ఆ మాట చెప్పించు! చెప్పుతో కొట్టినట్లుంటుంది!" అన్నాడు పార్థసారథి.

ఆ మాట విని తన గుండె గడగడ లాడింది.

తన అన్నగారు గుమ్మంలో నిలబడ్డ వదినవైపు చూసేడు.

ఆమె అర్థమైనట్లు తల పంకించి లోపలి కొచ్చింది.

"అతను విన్నేదో అడుగుతాడట రా!" అంటి తన చెయ్యి పట్టుకొని.

తను బలిపశువులా వదినగార్ని అనుసరించింది.

"అన్నపూర్ణా!" అన్నాడతను ఎంతో ఆత్మీయంగా.

తను తలెత్తి చూసిందతనివైపు.

అతని ముఖంలో తనపట్ల ఎంతో విశ్వాసం, ప్రేమ కనిపించేయి తనకి?

"నా మీద నమ్మకముంటే ఈ క్షణం బయటకి వచ్చేయి!" అన్నాడతను

తను అన్నగారివైపు చూసింది.

అతని కళ్ళలో భయం, కోపం, అస హాయత మిళితమైవున్నాయి!

తను మెల్లిగా రాజువేపు అడుగు లేసింది!

తను . తను . తన మనసుకి విరుద్ధంగా రాజుని చెంపమీద లాగి లెంప కాయ కొట్టి గిరున వెనుతిరిగి ఇంట్లోకి పరిగెత్తి మంచమ్మీద వాలి భోరున ఏడ్చింది.

"సెభాష్!" అంటూ మెచ్చుకున్నాడు హనుమాన్లు

"నోరు విప్పకుండా జవాబు చెప్పింది!" అన్నాడు పార్థసారధి.

"అది నా చెల్లెలు!" అన్నాడు అన్న గారు గర్వంగా.

"ఇక వెళ్ళరా నాయినా! తెలిసిందిగా మా కుటుంబం అంటే ఏమిటో!" అంటూ వదినగారు వెటకారం చేసింది.

శైలజ తల్లి అందించిన కౌగిలాన్ని విసురుగా విసిరేసింది. అన్నపూర్ణమ్మ నిర్లిప్తంగా నిలబడి చూసింది కూతురి వైపు.



అతను వెళ్ళిపోతున్నట్లుగా అడుగుల చప్పుడు!

తన కళ్ళనుండి అశ్రుధార ముత్యాల సరాల్లా జారిపోయింది!

ఆ రోజునుండి ఈ రోజువరకు తనకి ఏడుపే మిగిలింది!

రాజుని పోగొట్టుకున్నందుకు తను కుమిలిపోని క్షణం లేదు!

తిరిగి తన దీనస్థితే తన కన్నకూతురికి కూడ పట్టింది!

— అన్నపూర్ణ ఆలోచనలనుండి బయటపడి నీళ్ళబిందెతో ఇంటివేపు అడుగులేసింది.

• • •

“అమ్మా!” అంటూ బావురుమని ఏడ్చింది శైలజ.

అన్నపూర్ణమ్మ కూతురి తలపైన చేత్తో మృదువుగా నిమిరింది.

“ఈ కాగితాల మీద సంతకం పెట్టే కన్న యిద్దరం కలిసి ఇంత విషం మింగి చచ్చిపోదాం. మావయ్యకి అంతా అప్పచెప్పి మనసు చంపుకుని ఈ కొంపలో ఊడిగం చేసేకన్నా అదే నయం!” అంది శైలజ ఆవేశంగా.

“అనిరుద్ధ మీద నమ్మకముందా నీకు!” అన్నపూర్ణ కూతురి కళ్ళలోకి నిశితంగా చూస్తూ అడిగింది.

“నా పెళ్ళి జరిగి మూడేళ్ళయినా

అతను పెళ్ళి చేసుకోకుండా వుండి పోవడంలో అతనికి నా పట్ల వున్న ప్రేమ అర్థంకావడంలేదా అమ్మా! ఆ రోజు చస్తే బావని పెళ్ళిచేసుకోలేనని ఏడ్చినా నా మాట వినకుండా మామయ్య చంపేస్తాడని మెడలు వంచి నాకీ పెళ్ళి చేసేవ్! అనిరుద్ధ మరో కులంవాడని భయపడ్డావ్! సమాజానికి, మామయ్యకి వణికిపోతూ ఆస్తంతా అతని చేతిలో పెట్టి కిక్కురుమనకుండా అతను పెట్టిన బాధలన్నిటినీ భరించేవు! మామయ్య నన్ను నా మీద ప్రేమతో తన కోడల్ని చేసుకోలేదన్న సంగతి నీకూ తెలుసు! విమానాలు నడిపే అతని జీవితం ఏ క్షణం అంతమవుతుందోనన్న భయంతో ఎవరూ అతనికి పిల్లనివ్వకపోతే నా మీద కన్ను వేసేడు! ఈ దెబ్బతో మన పొలం కూడ పర్మినెంటుగా వాళ్ళ చేతికి చిక్కిపోతుందని తెలుసు! ఈ రోజు ఇంత జరిగినా అనిరుద్ధ నా మీద మునుపటి ప్రేమతోనే వున్నాడు నన్ను తప్ప మరో వ్యక్తిని జీవితంలోకి ఆహ్వానించననే మొండిపట్టుతో వున్నాడు." అంటూ ఆగింది శైలజ.

"ఈ విషయాలన్నీ నాకు తెలుసమ్మా!" అంది అన్నపూర్ణ చాల నిదానంగా.

శైలజ తల్లివైపు ఆశ్చర్యంగా చూసింది.

"తెలిసికూడ నన్ను ఆ ఉరికంబం ఎక్కించడానికే సిద్ధపడుతున్నారు?" అంది బాధగా.

"నీకు తెలీదు– మీ మామయ్య నక్క కన్న హీనం. తను అనుకున్నది జరగక పోతే నీ బ్రతుకునే బలిచేస్తాడు! అది నేను కన్నతల్లిగా భరించలేను!" అంది అన్నపూర్ణ బాధగా.

శైలజ తలదించుకొని ఏడ్చింది చాలాసేపు.

"సరే నీ యిష్టం! కానీ నీకు తెలీనిది ఒకటుందమ్మా! సిగ్గు విడిచి చెబుతున్నందుకు క్షమించు! బావతో పెళ్ళయి మూడు సంవత్సరాలయినా నేను అతనితో కలిసి కాపురం చేసింది కొన్ని రోజులు మాత్రమే! అదీ యిష్టంలేని కాపురం! 'ఆ జీవితమే నీకు చాలు' అని కన్నతల్లిగా నువ్వు శాసిస్తే కాదనేదేముంది?"

శైలజ వేసిన ఆఖరు అస్త్రానికి విలవిలలాడింది అన్నపూర్ణ తల్లి హృదయం.

శైలజ ఆవేశంగా సంతకాలు పెట్టబోతున్న ఆ కాగితాన్ని లాక్కొని కూతురి కళ్ళు తుడిచింది అన్నపూర్ణ.

తల్లి చర్యకి ఆశ్చర్యపడి చూసింది శైలజ.

అన్నపూర్ణ ఆ కాగితాన్ని గబగబ పరుపుక్రింద పెట్టి వంటగదిలో కెళ్ళి

మంచినీళ్ళ బిందె తీసుకుని చెరువు వేపు వెళ్తోంటే "ఈ వేళప్పుడు నీళ్ళేవిటి? ప్రొద్దుటే తెచ్చావుగా!" అంది కనకమ్మ సాగదీస్తూ

"ఏదో పురుగు పడింది వదినా!" అంటూ అన్నపూర్ణ చకచకా బయటకి చదిచింది.

* * *

సూర్యోదయం కాకముందే హనుమాన్లు, పార్థసారథి వచ్చి హాల్లో బెంచీమీద కూర్చున్నారు.

"ఏం జరిగింది?" అడిగేడు పార్థసారథి ఆత్రుతగా.

"ఏదీ యింకా, మీ రందరూ వచ్చేక అడుగుదామని ఊరుకున్నాను!" అన్నాడు రాఘవరావు వాలుకుర్చీలో నడుం వాలుస్తూ.

"త్వరగా తేల్చు మరి! పంతకాలు పెట్టడానికి ఎన్నాళ్ళు కావాలి!" అంటూ తొందరపెట్టేడు హనుమాన్లు

"అన్నా!" అంటూ కేక పెట్టాడు రాఘవరావు లోపలికి తొంగిచూస్తూ.

వంటగది గుమ్మంలో కూర్చుని వంకాయలు తరుగుతూన్న అన్నపూర్ణ తల తిప్పలేదు.

అన్నగారి పిలుపు వినికూడ తొణక్కుండా కూర్చున్న ఆడపడుచుని చూస్తే ఆశ్చర్యమేసింది కనకమ్మకి.

"వినిపిస్తుందా, మీ అన్నయ్య పిలుస్తున్నారు! వినబళ్ళే దా?" అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఎలాగోలా తమ పని జరిపించుకోవడమే ఆమె ధ్యేయం.

"వినబడింది!" అంది తల యెత్తకుండానే మరో వంకాయ తిరిగి నీళ్ళలో వేస్తూ.

కనకమ్మకి లాగి లెంపకాయ కొట్టాలనిపించింది.

"వెళ్ళు మరి, అవతల పెద్దమనుషులు నీ కోసం నిలబడి వున్నాయే!" అంది గొంతులోకి ఎక్కడలేని మార్దవాన్ని అరువు తెచ్చుకుంటూ.

అన్నపూర్ణ తలతిప్పి వదినగారి వైపొకసారి చూసి చేతిలోని వంకాయని నీళ్ళలో పడేసి కొంగుకి చేతులు తుడుచుకుంటూ వసారాలో కొచ్చింది.

చెల్లెలి వైఖరి చూస్తే రాఘవరావుకి అదోలా అనిపించింది.

అయినా దాన్ని పడనీయకుండా "పనిలో వున్నావేంటమ్మా" అంటూ ప్రేమగా పలుకరించేడు.

హేళనతో కూడిన చిరునవ్వొకటి అన్నపూర్ణ పెదవులపైకొచ్చి లీలగా తేలిపోయింది.

"ఏంటి?" అంది పొడిగా.

విషయమంతా తెలిసి అలా అడుగు

లోన్న చెల్లెల్ని ఆశ్చర్యపోయి చూడటం అతని వంతయింది.

"అదే.... శైలు ఆ కాగితాల మీద సంతకాలు పెట్టిందా?" అన్నాడు ఎలాగో.

"పెట్టింది!"

అన్నపూర్ణ జవాబుకి ఎగిరిపంత పని చేసేడు రాఘవరావు.

"మరి యింత చల్లటి కబురు ఇంత నిదానంగా చెబుతావేంటమ్మా!" అన్నాడు పార్థసారధి ఎంతగానో సరదాపడిపోతూ.

"అన్నపూర్ణమ్మ నిండుకుండ!" అంటూ మెచ్చుకున్నాడు హనుమాన్లు. ఈ సందడి విని గుమ్మందాకా వచ్చేసి నిలబడింది కనకమ్మ సంతోషంగా.

"అది నా చెల్లెలు! దబదబలాడకుండా పని చెయ్యటం దానికి తెలుసు! ఇంటి పరువుకోసం ప్రాణం యివ్వడం దాని కిప్పుడు కొత్తకాదు!" అన్నాడు రాఘవరావు గర్వంగా.

అన్నపూర్ణ తలెత్తి అన్నగారివైపు చూసి నవ్వింది.

ఆ నవ్వుతో కొండంత బలం వచ్చేసింది రాఘవరావుకి.

"తొందరగా ఆ కాగితాలు పట్టుకురా! వాటిని మళ్ళి పైకి పంపాలి!"

"ఆ పని నిన్ననే చేసేను!" అంది అన్నపూర్ణ శాంతిగా.

"ఆఁ!" అంటూ అదిరిపోయేడు రాఘవరావు.

అన్నపూర్ణ ఏమాత్రం తొణకలేదు.

"అవును! శైలజకి నీ కొడుకు భార్యగా వైధవ్యం భరించటంతోపాటు అతనికి సంబంధించిన మిగతా హక్కులు కూడ సంక్రమించేయి! అతనికి రావల్సిన పన్ని గవర్నమెంటు ఆమెకే అప్పజెబుతుంది! మధ్యలో మనమెందుకు! అందుచే వాటిని నిన్న నేనే పోస్టు చేసేమ్!" అంది.

రాఘవరావు అదిరిపోయేడు.

"నీకెంత ధైర్యమొచ్చిందే!" అన్నాడు కోపంతో వణికిపోతూ.

అన్నపూర్ణ పేలవంగా నవ్వింది.

"ఈ ధైర్యమే పాతికేళ్ళనాడు నాకు వచ్చివుంటే నా జీవితం మరొకలా వుండి వుండేది! నా పొలం - నా భర్త పొలం నీ చేతిలో చిక్కేది కాదు! నేను బ్రతుకంతా నీ కొంపలో ఊడిగం చేసి వుండేదాన్ని కాదు! నా కూతురికి ఇష్టం లేని పెళ్ళి- ఈ వైధవ్యం తప్పిపోయి వుండేయి!" అంది ఛీత్కారంగా అన్నగారి వైపు చూస్తూ.

చెల్లెలి మాటతో రెచ్చిపోయేడు రాఘవరావు.

అతని ముఖం కోపంతో చెక్కేసిన కందదుంపలా ఎర్రబడిపోయింది.

"ఓహో! చాల దూరం వచ్చిందన్న



మాట సంగతి? ఇల్లలగ్గానే పండగకాదు! అసలు తల్లీకూతుళ్ళు ఈ గడప ఎలా దాటతారో అది నేను చూస్తాను!" అంటూ రెచ్చిపోయేడు.

అన్నపూర్ణ నిరసనగా నవ్వింది.

"అవన్నీ సిద్ధంచేసుకునే వున్నానన్నయ్యా! కాస్సేపట్లో అనిరుద్ధ వస్తాడు శైలజ పెళ్ళి అతనితో జరిగి తీరుతుంది. కానీ ఇప్పుడు కాదు! గి కొడుకు చేత తాళికట్టించుకుని విధవయి వందుకు రావల్సినవన్నీ రాబట్టుకున్నాకనే!" అంది.

రాఘవరావు కళ్ళు బయటకొచ్చేపేట్లు కళ్ళురిమేడు.

"నంగనాచిలా వుండే నువ్వు ఎంతకి తెగించావే! దానికి మళ్ళి పెళ్ళిచేసి ఇంటి గౌరవం తీసావా!"

"గౌరవం! పరువు! జీవితమంతా అడవికాచిన వెన్నెల చేస్తే - బ్రతుకంతా కన్నీటిమయం చేస్తే చివరికెప్పుడో దెప్పిపొడుపుల మధ్య మీరిచ్చే బిరుదు కోసం నా కూతురు ఎదురుచూసే స్థితిలో లేదన్నయ్యా! ఆ రోజు సరిగ్గా పాతికేళ్ళ క్రితం నేను సమాజాన్ని చూసి ఝడిసో, మంచి పేరు సంపాదించుకోవాలన్న తపనతో దేవుడిలా నన్ను కోరిన వ్యక్తిని త్రోసిపుచ్చి నీ కొంపలో ఊడిగం చేస్తూ ఒంటరి బ్రతుకు గడిపేను! బాధ కలిగినప్పుడు ఊరడించే తోడులేక నేనేం పోగొట్టుకున్నానో అర్థమయి మూగగా రోదించడం మినహా మరేమీ చేయలేక పోయేను! కేవలం మూడు నెలల కాపురంతోనే నన్ను పరిపెట్టుకోమని ఈ రోజువరకు ప్రత్యేకమైన నరకగదిలో

మీరు సరాగాలాడుతూ ఈ రోజున నా కూతుర్ని కూడ నాలాగే మ్రగ్గిపొమ్మని శాసిస్తున్నారు! కాని అప్పుడు జరగదు! అది నా కూతురు! దాన్ని శాసించడానికి మీ కెలాంటి అధికారం కాని హక్కు కాని లేదు!" అంటూ ఆవేశంతో అరిచింది అన్నపూర్ణ.

"హవ్వ! ఎంతకు తెగించింది!" అంటూ నోటికి గుడ్డ అడ్డంపెట్టుకుంది కనకమ్మ.

"నిజమే! కొడుకు పోయినందుకు బాధపడటం మానేసి - శవం మీద డబ్బులు ఏరుకునే మీకు నాది తెగింపు గానే వుంటుంది! అమ్మా, శైలా, నువ్విక బయటికి రా!" అంటూ పిలిచింది అన్నపూర్ణ.

ఒక చిన్న సూట్‌కేస్ తీసుకొని బయటకొచ్చింది శైలజ.

రాఘవరావు ఉగ్రుడై నిలబడి పోయేడు.

"మీ రెలా గడప దాటుతారో చూస్తాను!" అన్నాడు ఆవేశంగా.

అతనితోపాటు హనుమాన్లు, పార్థ సారధి కూడ లేచి నిలబడ్డారు.

సరిగ్గా అప్పుడే లోపలికొచ్చేడు అనిరుద్ధ.

"మీ రనవసరంగా ఆవేశపడిపోకండి. దానివలన జైలుకి పోవడం తప్ప ప్రయోజనం వుండదు!" అంటూ శైలజ చేతిలోని సూట్‌కేస్ అందిపుచ్చు కొన్నాడు అనిరుద్ధ.

"ఏం బెదిరిస్తున్నావా!" అంటూ అతని మెడమీద చేయ్యేపేడు రాఘవ రావు.

"అన్నయ్యా, ఆ చెయ్యి దించు! ఇలాంటిది జరుగుతుందని తెలిసే నేను ముందు జాగ్రత్తగా నిన్ననే పోలీస్ రిపోర్టు యిచ్చి వచ్చేను! వాళ్ళు బయట నిలబడి వున్నారు!" అంది అన్నపూర్ణ కటువుగా.

రాఘవరావు చెయ్యి క్రిందకి వాలి పోయింది!

వంద జలగలు ఒక్కసారే అతని ముఖంమీద పడి రక్తం పీల్చేసినట్లుగా పాలిపోయింది అతని ముఖం!

అన్నపూర్ణ ధీమాగా నడుస్తోంది కూతురి ప్రక్కగా - కాబోయే అల్లుడి వెనుకగా!

ఆ ముఖంలో చెప్పలేని కాంతి!

కడుపుతీపి ఎంత ధైర్యాన్నిస్తుందో ఆ క్షణంలోనే అర్థమయిందామెకి.

ఇంతకాలం చీకటిలో మగ్గిపోయి, చీకటిలోనే తను బ్రతికినా తన బిడ్డ భవిష్యత్తు చీకటిలో మగ్గిపోకూడదని - ఆ తల్లి తీసుకొన్న నిర్ణయం ఆ బిడ్డకి వెలుగునివ్వబోతోంది!

అప్పుడే తూర్పున సూర్యోదయం అయ్యింది.

—X—